క్లుప్తంగా

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఏఈ రాజు

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటైన కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిన్నారం ఏఈ రాజు తెలిపారు. మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో ఉన్న 181 సర్వేనంబర్‌లో ఇటీవల నిరుపేదలకు కేటాయించిన స్థలాల్లో ఇంటి నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి. కానీ విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. దీంతో ఏఈ రాజు సిబ్బందితో బుధవారం కాలనీకి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ త్వరలోనే కాలనీకి విద్యుత్‌ను అందించేవిధంగా చర్యలు తీసుకుంటామని, ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ భార్గవ్, ఉప సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రిస్మస్ చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీటీసీ, పాస్టర్లు

మనూరు(నారాయణఖేడ్): ప్రభుత్వం అందజేసిన క్రిస్మస్ చీరలను మనూరు మండల కేంద్రంలోని చర్చిలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి పాస్టర్‌లు ప్రకాశ్, లాజర్, మల్లేశ్, శ్రీను, యోహాను, సాల్మన్, చింటు, సాయిలు, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అంబేడ్కర్ నాటక ప్రదర్శన



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి పుస్తకాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు

నారాయణఖేడ్: అభ్యుదయ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను ఖేడ్ శివారులోని ఆడిటోరియంలో బుధవారం ప్రదర్శించారు. నాటక బృందం నిర్వాహకులు జగ్గరాజు రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి అంబేడ్కర్ పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు చంద శ్రీనివాస్, న్యాయవాది భోజిరెడ్డి, కౌన్సిలర్ దారం శంకర్, కేవీపీఎస్ నాయకులు నర్సింహులు పాల్గొన్నారు.


ముగిసిన జాతర



స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామంలో నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి జాతర బుధవారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవా కార్యక్రమాన్ని గ్రామ పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సర్పంచ్ మారుతి యాదవ్ నాయకులు శ్రీపతి, విఠల్‌రెడ్డి, సిద్దారెడ్డి, నర్సింహరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, వైద్యనాథ్, జైపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): మాణిక్‌ప్రభు జయంతి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. 9 రోజుల పాటు ప్రభు మందిరంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజున మాణిక్‌ప్రభు రథోత్సవ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌ప్రభు భక్త బృందం భజన, మహిళల నృత్యాలు కోలాటాలు ఆకర్షించాయి.

దళితవాడకు అందని 'భగీరథ'

- చెంతనే ఫిల్టర్ బెడ్ ఉన్నా గుక్కెడు తాగునీరు కరువు
- ఆ వాడకు శాపంగా అధికారుల నిర్లక్ష్యం
- స్వయంగా బోరుమోటారు వేసుకొని సమస్య పరిష్కరించుకున్న దళితులు



పోచారంలో దళితులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న బోరుమోటారు

పుల్‌కల్(అందోల్): ఆ గ్రామాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ దత్తత తీసుకుంది. పైగా ఆ గ్రామంలోనే 50 గ్రామాలకు తాగునీటిని అందించే మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ కూడా ఉంది. దీంతో నీటి సమస్య తీరుతుందని గ్రామస్తులు భావించారు. కానీ సమస్యలు తీరడమేమోగాని దళితులు నివసిస్తున్న వాడలోకి మిషన్ భగీరథ నీరు రావడంలేదు. పోచారం గ్రామ పంచాయతీలో 40 కుటుంబాలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని కష్టాల కడలిని ఎదుర్కొంటున్నారు. గుక్కెడు దాహం తీర్చుకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. తాగునీటిని సరఫరా చేయాలని దళితులు అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఫలితం లేకపోవడంతో విసిగివేసారిన పేదలు సొంతంగా రూ.2లక్షలు ఖర్చుచేసి బోరు బావి తవ్వుకొని దాహార్తి తీర్చుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల పరిధిలోని పోచారం గ్రామంలోని దళిత కుటుంబాల తాగునీటి కష్టాలపై కథనం..

చందాలు వేసుకొని..

తాగునీరు సరఫరా చేయాలని నాలుగేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన 40 దళిత కుటుంబాలు చేసేదేమీ లేక ఇంటికి రూ.3వేల చొప్పున చందాలు వేసుకుని స్వయంగా బోరుమోటారు వేయించి నీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. సొంత ఊరులో 50 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ఫిల్టర్‌బెడ్ ఉన్నా అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

మేమే బోరుమోటారు వేయించుకున్నాం



మా వార్డులో మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని నాలుగేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రామంలో 50 గ్రామాలకు తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్ ఉన్నా ఫలితం లేదు. దీంతో చేసేదేమీలేక చందాలు వేసుకొని బోరుమోటారు వేయించుకున్నాం.

– దప్పు రాజు, వార్డుమెంబర్, పోచారం

ప్రతి ఇంటికి రూ.3వేలు ఇచ్చాం



మిషన్ భగీరథనీరు రాకపోవడతో మా వాడ వాసులం ప్రతి ఇంటికి మూడు వేలు వసూలు చేసి స్వయంగా బోరుమోటారును బిగించుకున్నాం. ఉచితంగా ప్రభుత్వం అందించే తాగునీటి కోసం మేమే సొంత డబ్బులను ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పథకాలు పేదల దరికి చేరడంలేదనడానికి మా వాడలో తాగునీటి సమస్యనే ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

– దుర్గమ్మ గృహిణి, పోచారం

విరమణ నెలలోనే పింఛన్ పత్రాలు



పింఛన్ పత్రాలను అందజేస్తున్న శ్రీదేవి

పటాన్‌చెరు టౌన్: చందాదారులకు చేరువయ్యే విధంగా ప్రయాస్ పథకం ద్వారా ఉద్యోగ విరమణ పొందుతున్న నెలలోనే పింఛన్ పత్రాలు అందజేస్తున్నామని పటాన్‌చెరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాలాగ్రవాల్ పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో పెన్నార్ పరిశ్రమలో నిర్వహించిన నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమం నిర్వహించారు. డిసెంబర్ నెలలో 13 మందికి పింఛన్ మంజూరు చేయగా, అందులో పది మంది పింఛన్ మంజూరు పత్రాలను పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి అందజేశారు. కార్యక్రమంలో పెన్నార్ పరిశ్రమ యాజమాన్యం, పీఎఫ్ కార్యాలయ అకౌంట్ అధికారి బబుల్ నాథ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థిని సంతోషి ప్రియకు డాక్టరేట్



సంతోషిప్రియ

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని సంతోషిప్రియను డాక్టరేట్ వరించింది.లిక్విడ్ క్రోమాటో గ్రాఫిక్ పద్ధతులను సూచించే స్థిరత్వం ద్వారా బల్క్, ఫార్ములేషన్స్‌ల ఎంపిక చేసిన ఔషధాల విశ్లేషణపై ఆమె అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఔషధాల విశ్లేషణ కోసం సరళమైన, ఆర్థిక, ఖచ్చితమైన ఐసోక్రటిక్ పద్ధతుల అభివృద్ధిపై ఈ పరిశోధన దృష్టి సారించిందని ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్ తెలిపారు. పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంతో గీతం విశ్వవిద్యాలయం, అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, విశాఖపట్నం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజా, నిశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ సోడూరి రామారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీపీ దేవదాసు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాసు, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దేవదాసు, తహసీల్దార్ సంజీవ్‌రావు అన్నారు. ఆరు గ్యారంటీలపై మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటరు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో సూపరిండెంట్ మారుతీ విఠోభా, వైస్‌ఎంపీపీ మల్లన్నపాటిల్, ప్రజాప్రతినిధులు శంకర్‌పాటిల్, రాంరెడ్డి, శకుంతలమ్మ, మోహన్‌రెడ్డి, నందప్ప, పరమేశ్వర్‌పాటిల్, ఇక్బాల్ జానీ, అధికారులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు చిట్టిబాబు, శంకర్, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, రేఖ, హరికృష్ణగౌడ్, ప్రవీణ, మాధవి, నాగరాజు, సురేష్, దుర్గేష్, చందర్‌నాయక్, జాకియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలో 4 చోట్ల 4 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ కుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ కౌంటర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం, 2వ కౌంటర్ జీహెచ్‌ఎంసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, 3వ కౌంటర్ శ్రీనగర్ కాలనీలోని వార్డు కార్యాలయం, 4వ కౌంటర్ బండ్లగుడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పటాన్‌చెరు: మండల పరిధిలోని రామేశ్వరం బండ, ఐనోల్, బానూరు, క్యాసారం గ్రామాల్లోలో 6 గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో బన్సిలర్, తహసీల్దార్ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మునిపల్లి(అందోల్): ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీలపల్లి గ్రామంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

సంగారెడ్డి టౌన్: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండలంలోని కోతలాపూర్ గ్రామంలో ప్రజాపాలనపై దరఖాస్తులు నిర్వహించే ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, ఎంపీపీ దేవదాసు అన్నారు. బుధవారం ఝరాసంగంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మల్లన్నపాటిల్, ప్రజాప్రతినిధులు శంకర్‌పాటిల్, శకుంతల, మోహన్‌రెడ్డి, నందప్ప, రాంరెడ్డి, సీనియర్ నాయకులు మారుతీరావుపాటిల్, గుండప్ప, పెంటయ్య, ముల్తానీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవ్‌రావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

కంది(సంగారెడ్డి): ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. ఎంపీపీ సరళపుల్లారెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం విద్య, ప్రాథమిక ఆరోగ్యం, పంచాయతీరాజ్, ఐకేపీ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, స్త్రీశిశు, సంక్షేమం, రెవెన్యూ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఏఈ రవి, ఆర్‌అండ్‌బీ ఏఈ సురేశ్, ఎంఈఓ వెంకట్ నర్సింహులు, ఏఓ ప్రసాద్, మండల వైద్యాధికారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలనకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ హరినందన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు తప్పకుండా సంక్షేమ పథకాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వట్‌పల్లి(అందోల్): నేటి నుంచి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దారు అంథోని పేర్కొన్నారు. అందోల్ మండలంలో రెండు బృందాలుగా అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. అదేవిధంగా వట్‌పల్లి మండలంలో తహసీల్దారు శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ జగదీశ్వర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నారాయణఖేడ్: ప్రజాపాలనలో భాగంగా నేటి నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు ఖేడ్ మండలంలో నిర్వహించనున్న గ్రామసభలకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి విడుదల చేశారు. రోజుకు ఆరు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బెల్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బెల్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి ఎల్‌ఐజీ కాలనీకి వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి చెట్ల మధ్య గుర్తుతెలియని మృతదేహం ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 45 ఏళ్లు ఉండవచ్చని, ఒంటిపై నీలిరంగు షర్టు, నల్లప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

జహీరాబాద్ టౌన్: సీపీఐ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్ అన్నారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. జనవరి నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం కార్యదర్శి నర్సింహులు, నాయకులు అశ్వాక్, శంకర్, పూజ, అమృత, నాగమణి, వినోద పాల్గొన్నారు.

సన్మానం

నర్సాపూర్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని మంగళవారం సన్మానించారు. సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రకాష్ తదితరులు సునీతారెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

సీసీఐ అధికారుల తీరుపై ఆగ్రహం



నాగల్‌గిద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

- 4 రోజులుగా నిలిచిన పత్తి కొనుగోళ్లు
- ప్రధాన రహదారిపై ధర్నాకు దిగిన రైతులు
- ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగిన సమస్య

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని విజయ పత్తి మిల్లులో నాలుగు రోజులుగా సీసీఐ అధికారులు రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో మిల్లు వద్దకు రైతులు తీసుకువచ్చిన ట్రాక్టర్లు, డీసీఎంలు మిల్లు వద్ద బారులుగా నిలిచిపోయాయి. ఫలితంగా రైతులు తమ వాహనాల కిరాయిలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు స్థానిక ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా, రస్తారోకో నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి.

ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగిన సమస్య

నాగల్‌గిద్ద ప్రధాన రహదారిపై ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి రైతుల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సీసీఐ అధికారులను పిలిపించి రైతులకు ఇబ్బంది పెట్టరాదని అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా రైతులు తీసుకువచ్చిన పత్తి వాహనాలను మిల్లువద్ద నిలపడంతో రైతులకు వాహనాల కిరాయిలు పెరిగి తీవ్ర నష్టం జరుగుతుందని వెంటనే పత్తి వాహనాలను అన్‌లోడింగ్ చేయాలని అధికారులను ఆదేశించగా పత్తి వాహనాలను మిల్లులోకి అనుమతించి అన్‌లోడింగ్ చేయడం ప్రారంభించారు. దీంతో రైతులు ధర్నా, రాస్తారోకోను విరమించారు.

ముగిసిన దత్తాత్రేయస్వామి ఉత్సవాలు



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని మాధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రంలో వారం రోజుల నుంచి నిర్వహించిన బ్రహ్మోత్సవాలు బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలతో భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ముత్తంగి గ్రామంలో...

పటాన్‌చెరు: మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో దత్తాత్రేయస్వామి జాతర ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా దత్తాత్రేయస్వామిని ముత్తంగి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌గుప్తా, ఎస్ఆర్‌కే యువసేన నాయకులు ధనరాజ్, సాయి తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని దత్తాత్రి ఆశ్రమంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు గుండేరావు, ప్రభాకర్‌రెడ్డి, సంజుపాటిల్, భజన్‌లాల్, రూప్‌సింగ్, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు



గ్యాస్ ఏజెన్సీ వద్ద నిరీక్షిస్తున్న జనం

నారాయణఖేడ్: గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ప్రజాపాలనలో భాగంగా రూ.500లకే సిలిండర్ పొందాలంటే ఈకేవైసీ చేయించుకోవాలనే అపోహతో జనాలు గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఒకవైపు ఈకేవైసీకి రూ.500 సిలిందర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఈకేవైసీ చేసుకోవడానికి నిర్ణీత గడువు, తేదీ అంటూ ఏమీలేదని తెలుపుతున్నా జనాలు మాత్రం ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ విధంగా జనాలు ఈకేవైసీ కోసం నిరీక్షిస్తూ కనిపించారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



పుష్పాలంకరణలో స్వామివారు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని నవరత్నాల దేవస్థానంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ నిర్వహణలో బుధవారం లక్ష పుష్పార్చన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు, మహిళలు పుష్పాలను పూజించి స్వామివారికి సమర్పించారు. సాయంత్రం అష్టాదశ సోపాన మహాపడి పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.